

# పొరపాటు

యద్దనపూడి సులోచనారాణి

"ఇదుగో - ఒరే! శ్రీధరం. అబ్బాయి యెక్కడ్రా నువ్వు, ఇలా రా! అయ్యొ రామా! పుత్తరాలు అందటం ఇంత ఆలస్యమైతే యెలాగంట ఇలా రారా బాబూ!"

నిలువుటద్దం ముందు నిలబడి కూనిరాగం తీస్తూ ఒకసారి కట్టుకున్న టై విప్పేసి బాగా లేదని మరోసారి నిదానంగా కట్టుకుంటున్న శ్రీధర్ వులిక్కి పడ్డాడు. యేదో అయింది లేకపోతే అంతబిగ్గరగా కేకలు పెట్టదు. చేతిలోవున్న టైని టేబిల్ మీద పడేసి ఇవతలకు వచ్చాడు. అప్పటికే గది గుమ్మం దగ్గరకు వచ్చేసింది బామ్మగారు. ఆవిడ చేతిలో వుత్తరం వుంది. మనిషి మహాఖంగారుగా వుందని తలమీద నుంచి జారిపోయిన కొంగే చెప్తోంది.

"యేమిటది? యెక్కడ్నుంచి వుత్తరం?" అన్నాడు శ్రీధర్ తను గూడా ఆదుర్దా పడ్తూ.

"జయలక్ష్మి వస్తున్నానని వుత్తరం రాసిందిరా! చూడు. మొన్న సాయంత్రం అందవలసిన వుత్తరం ఇది. ఇప్పుడు అందింది. ఈ సాయంత్రం కారుకే వస్తోందట. ఒక్కత్తీ - ఇదే మొదటిసారి రావటం. యెంత ఇబ్బంది పడేదీ. నయం, ఇప్పుడైనా అందింది. అదే పదివేలు. నువ్వు కొంచం కారు దగ్గరకు వెళ్ళిరా."

"ఇప్పుడా, నేనా?" శ్రీధర్ ఆగిపోయాడు.

"అవును. నువ్వే, లేకపోతే నేను వెడ్తానా యేమిట్రా? యెలాగూ తయారయి గూడా వున్నావు. పద, పద. ఆ కాస్త కాఫీ తాగి వెళ్లు. కారు యెప్పు డొస్తుందో యేమిటో. పిచ్చిపిల్ల. కారుదగ్గరకు యెవరూ రాకపోతే ఖంగారు పడిపోతుంది. రా-రా" వచ్చినంత వేగంగా ఆవిడ తిరిగి వెళ్ళిపోయారు.

శ్రీధర్ అలాగే నిలబడి పోయాడు. ఇప్పుడెలా? ఈ రోజు క్లబ్ మీటింగ్ వుంది. అందుకే గబగబ తయారవుతున్నాడు. ఈ సంవత్సర వార్షికోత్సవానికి జరపబోయే యేర్పాట్ల గురించి చర్చించాలి. అందులో ఈరోజు మాట్లాడవలసింది అందరికంటే తనే ముఖ్యం. వెళ్ళకపోతే ప్రెసిడెంట్‌కి కోపం గూడా వస్తుంది. యెలా - యేదిదారి అనుకుంటూ వెనక్కు తిరిగి వచ్చి టేబిల్‌మీద పడేసిన టై తీసి కట్టుకో సాగాడు. బామ్మ భాషలో వీల్లేదు - కాదు అనే పదాలకి అర్ధంగాని విలువగాని లేవు. కాలేజీకి టైమయింది. క్లాసుకి ఆలస్యంగా వెడ్తే పిల్లలు గోలచేస్తారమ్మా త్వరగా భోజనం పెట్టి పంపు అంటే "ఆగరా! ఆదరా బాదరా తింటే ఆరోగ్యం పాడయి పోదూ. అది లేకపోతే ఇహ బతుకేముంది గనక. ఆరోగ్యం కోసం దేన్నయినా నిర్లక్ష్యం చెయ్యొచ్చుగాని, ఇంకో దానికోసం దాన్ని నిర్లక్ష్యం చేసుకుంటారా? మీ తాతగారు యెప్పుడూ ఆరోగ్యమే మహాభాగ్యమే అమ్మడూ అంటూండేవారు. పాపం - చచ్చి యేలోకాన వున్నారోగాని... అలా అంతం అవుతుంది సంభాషణ. ఇహ తప్పదు. ఈ రోజు వెళ్ళాల. రేపు ప్రెసిడెంట్‌కి క్షమార్పణ చెప్పుకోవాలి. అయినా ఆర్నెల్లనుంచివస్తావస్తా అని రాసిన ఆ జయలక్ష్మి ఇప్పుడే రావాలీ తన ఖర్మ కాబోతే. జయలక్ష్మి వస్తుందిరా జయలక్ష్మి వస్తుందిరా అని బామ్మ చెప్పటం తను - ఆర్నెల్లనుంచి వింటూనే వున్నాడు. అసలిదెక్కడి చుట్టరికమోమరి. బామ్మ ఆడ బడుచుకి మనమరాలికి తోడు కోడలు చెల్లెలుట. యేదో పెళ్ళిలో చూసిందట - అప్పట్నుంచీ జయలక్ష్మి కోసం బామ్మ ఒక్కటే కలవరింత. ఆవిడ క్కూడా ఈవిడంటే చాలా ఇష్టంట. పోనీ ఇష్టం వుంటే వుంది. వస్తే వచ్చింది. మధ్య తన ప్రాణాలమీదకు తెచ్చిందే. అద్దంలో ప్రతిబింబాన్ని గమనిస్తూ టైనాట్ బిగిస్తున్న శ్రీధర్ హఠాత్తుగా ఆగిపోయాడు. మరు క్షణంలో యేదో మెరపులాటి ఆలోచన కలిగినట్టు కళ్లు తళుక్కుమన్నాయి. ఆ! అదీ - అనుకుంటూ టై అలాపట్టుకుని గబగబా వంటయింటి దగ్గరకి పరుగెత్తుకొచ్చాడు. వంట ఇంట్లో బామ్మగారు వంట హడావుడిలో వుండి శ్రీధర్‌ని గమనించలేదు. వంట ఇంటి గుమ్మం మీద చేయివేసి లోపలకి తొంగి చూస్తూ 'బామ్మా మరి నేనెప్పుడూ ఆవిడను చూడ లేదు. యెలా గుర్తుపట్టటం? శంభు కారు తెస్తాడు. కాస్త నువ్వు వెడ్దూ," అన్నాడు.

"మంచివాడవే! ఉదయం నుంచి వుపవాసం వుండి దీక్షతో వున్న నేను ఆ వెధవ కారెక్కి మైల పడమంటావూ? గుర్తులకేం. నేను చెప్తానుగా-రా! ఈ కాస్త కాఫీ తాగేసెయ్యి." అంది ఆవిడ పొగలు గక్కుతున్న కాఫీ వెండి గ్లాసుతో ఇస్తూ.

"చెప్పుమరి" అన్నాడు శ్రీధర్ హతాశుడై, పాంట్ జేబులోంచి జేబురుమాలు తీసి గ్లాసు పట్టుకుంటూ.

ఆవిడకి యెన్ని సార్లు చెప్పినా అంతే. వెండి గ్లాసు వద్దు మొఖ్ఖో కాల్తుంది అంటే 'ఛ' అదేమిట్రా. గతిలేనివాడిలా గాజు కప్పుల్లో తాగటం యేమిటి? అంత కాల్తుంటే చల్లార బోసుకుని తాగాలి కాని.' అంటుంది. ఆవిడకి చెప్పి, వాదించటం ఇష్టం లేని శ్రీధర్ ఆవిడ చూడకుండా గాజు గ్లాసులోనో కప్పులోనో పోసుకు తాగుతాడు.

"చూడు మనిషి పచ్చగా పసుపు ముద్దలా వుంటుంది. నీ భుజాల దగ్గరకు వచ్చే యెత్తుంటుంది." వర్ణన మొదలు పెట్టింది ఆవిడ.

ఇది బాగుంది. పోనీ రంగంటే యేలాగో తెలుసుకోవచ్చు. కానీ యెత్తెలా - ప్రతి ఆడవాళ్ళ దగ్గరకు వెళ్ళి పక్కన నిలబడి యెత్తు కొల్చుకోవాలిగాబోలు. కొంచెం చురుకైన ఆడపిల్ల అయితే అలా చేస్తే చెంపలు శుద్ధిచేసి పంపిస్తుంది అనుకున్నాడు శ్రీధర్.

"పెద్దజడ. అంతలావుగాదు, అంత సన్నంగాదు. సరిసమానంగా వుంటుంది. కళగల మొహం. "కళగల మొహం అంటే? ప్రతి వాళ్ళకి ఏదో కొంత కళ వుండకపోదు. కాకపోతే కొంతమంది మొహాలు విద్యుద్దీపాల్లా వుంటే మరి కొంత మందివి ఆముదం దీపాల్లా వుంటాయి. మరీ కొంతమందివి ఆరి పోతున్న దీపాల్లా వుంటాయి.

బామ్మగారి వర్ణన పూర్తికాలేదు. "చక్కని చుక్కలా వుంటుంది." చేతిలో మిఠాయి పొట్లం గూడా వుంటుందా అనుకున్నాడు శ్రీధర్.

'దాందంతా మా చచ్చిపోయిన పిన్నత్తగారి పెత్తల్లి కూతురు పోలికలే. అయినా సొద్యం గాకపోతే అసలు బెజవాడ పిల్లలు చూస్తూనే తెలిసి పోరుట్రా. నీదంతా మరీ విచిత్రం గాకపోతే" తరుగుతున్న అరటికాయ ముక్కలు నీళ్లల్లోపడేస్తూ శ్రీధర్ వంక చూస్తూ అంది. జయలక్ష్మి వస్తోంది అన్న వుత్సాహం ఆవిడ మొహంలో స్పష్టంగా కన్పిస్తోంది.

"బావుంది. బెజవాడ అమ్మాయి - హైద్రాబాదు అబ్బాయి అని మొహం మీద రాసుంటుందా బామ్మా యేమో బాబూ! నీ వర్ణనల ప్రకారం కళ గల మొహం, పెద్ద జడమ్మాయి. పసుపుకొమ్ము రంగున్న మనిషి వస్తేనే తీసుకొస్తాను. లేకపోతే నిజం జయలక్ష్మి వచ్చినా తీసుకురాను. నువ్వు మా బామ్మ చెప్పిన అమ్మాయివి కాదు అని వదిలేస్తాను. ఆపైన నీ ఇష్టం," అంటూ శ్రీధర్ ఇవతలకు వచ్చేశాడు.

బైట వరండాలో తనకోసం యెదురు చూస్తున్న శంభుకి తను క్లబ్‌కు రాలేనందుకు చింతిస్తూ క్షమార్పణ కోరుకుంటూ రేపు ఉదయం తప్పకుండా కలుస్తానని వాగ్దానం చేస్తూ రాసిన చీటి ఇచ్చి సైకిల్ మీద వెళ్ళి ఇచ్చిరమ్మనమని పంపి తను కారు తీసుకుని జయలక్ష్మి గుర్తులు జ్ఞాపకం చేసుకుంటూ కారు దగ్గరకు బైలుదేరాడు.

శ్రీధర్ వెళ్ళిన 10 నిముషాలకు కాని బెజవాడ నుంచి వచ్చే కారు రాలేదు. నిన్నటి వరకూ ఆ కారు రాత్రి 10 గంటలకు వస్తోందట. కానీ ఈ రోజు సరిగ్గా టైమ్‌కే వస్తోంది. 'అదృష్టమే, త్వరగా వచ్చేస్తే ఇంటి దగ్గర దింపేసి తను క్లబ్‌కు పోవచ్చు' చేతి వాచి చూసుకుంటూ కారు కోసం యెదురు చూస్తున్నాడు శ్రీధర్.

కారు వచ్చింది. అందులోంచి అలిసిపోయిన ప్రయాణికులు హడావుడిగా దిగుతున్నారు. కొంత మంది సామాను చూసుకుంటున్నారు. ఇంకా కొంత మంది తనకోసం వచ్చిన వాళ్ళని చూసుకుంటున్నారు. కారుకి కొద్ది దూరంలో నిలబడి దిగబోయే ఆడవాళ్ళ కోసం చూస్తున్నాడు శ్రీధర్. అందులోంచి ఇద్దరే ఆడవాళ్ళు దిగారు. ఆ ఇద్దర్లో ఒకావిడ వయసు మళ్ళిన సువాసిని, మరో అమ్మాయి - 20 సంవత్సరాలు నిండీ నిండనట్లున్నాయి. వాళ్ళిద్దరూ తల్లీ కూతుళ్ళేమో. కారులో ఇంకెవరయినా వున్నారేమో అని చూస్తున్న శ్రీధర్‌కి కారులో యెవరూ కన్పించకపోగా క్రిందకు దిగిన ఇద్దరిలో పెద్దావిడ తన కోసం వచ్చిన ముసలాయనకి మర చెంబు ఇస్తూ 'వెళ్ళొస్తానమ్మా' అనటం ఆ అమ్మాయి యెటో అదుర్దాగా చూస్తూ 'ఊ-' అని తలూపటం కన్పించింది. కొంచం దగ్గరగావచ్చి ఆ అమ్మాయిని పరీక్షగా చూశాడు శ్రీధర్. యెవరికోసమో వెతుకుతున్నట్లు నిలబడ్డ ఆ అమ్మాయి శ్రీధర్ని గమనించలేదు. మరికొంచం దగ్గరగా వచ్చి బాగా చూశాడు. అచ్చు బామ్మ వర్ణించినట్లు అక్షరాలా లేదుగాని, ఇంచుమించు అలాగేవుంది. అందమైన కళ్లు, కాంతి గల రంగు, చక్కటి వంపుల్తో కావాలని శ్రద్ధగా మలిచినట్లున్న శరీరం - బామ్మ చెప్పినవాటిల్లో ఒకటి మటుకు స్పష్టంగా తెలుస్తోంది. అది ఆ అమ్మాయి జడ. తాచుపాము వెన్నుపూసని అంటుకున్నట్లుగా వుంది. "మీ పేరు?" అన్నాడు శ్రీధర్ అప్పుడే కళ్ళు తిప్పి తనని గమనిస్తున్న ఆ అమ్మాయి నుద్దేశించి. "లక్ష్మి" అంది ఆ అమ్మాయి బెదురు కళ్ళతో శ్రీధర్ని చూస్తూ.

"గుడ్! ఇంత సులభంగా తెలుస్తారనుకోలేదు. మీ వుత్తరం ఈ సాయంత్రమే అందింది. లేకపోతే చాలా ఇబ్బంది పడేవాడ్ని" చురుకుదనాన్ని నింపుకున్న ఆ కళ్ళలో యేదో శక్తి శ్రీధర్ని సరిగ్గా మాట్లాడలేకుండా చేసింది. మొదట్లో తెల్లబోయినట్లు భయపడ్డట్లు కన్పించినా ఆ అమ్మాయి త్వరలోనే సర్దుకుని వచ్చి శ్రీధర్‌తో కారులో కూర్చుంది.

"యెలాగైనా బెజవాడ పిల్లల్ని గుర్తు పట్టటం తేలికే." బామ్మగారి మాటలు తన మాటలుగా చెప్పుకున్నాడు శ్రీధర్ డ్రైవ్ చేస్తూ. రోడ్లని, లైట్లనీ,

వేగంగా పాకి పోతున్న కార్లని వింతగా పరికిస్తున్న ఆ అమ్మాయి ఒకసారి పళ్ళు తళుక్ మనేట్లు నవ్వి మళ్ళీ గంభీరంగా కూర్చుంది. చాలా కొత్తలావుంది. బామ్మ చెప్పినంత మాటకారిలా లేదే! పర్వాలేదు. ఈ మూగతనం రేపీపాటికి వదిలిపోదూ? ఇలాటి అమ్మాయిని ప్రక్కన కూర్చో పెట్టుకుని డ్రైవ్ చేస్తుంటే యెంత బాగుంది! శ్రీధర్‌కి ఈ అనుభవం కొత్తగా వుంది. యాంత్రికంగా అతని చేతులు స్టీరింగ్‌ని తిప్పుతుంటే మనసు మాత్రం యెక్కడెక్కడో తిరగ సాగింది. అతను ఆ అమ్మాయితో గోల్కొండ వెడ్తున్నాడు, సాలార్ జంగ్ మ్యూజియం చూస్తున్నాడు. గండి పేట రిజర్వాయరు దగ్గరున్న మెట్ల మీద నిలబడి రాతి కిడ్కీలను పట్టుకుని దన్ దన్ మని శబ్దం చేస్తూ పడ్తున్న నీళ్ళని చూస్తున్నాడు. ఆఖరికి ఓ రోజు రాత్రి బాగా 10 గంటలు దాటింతర్వాత కారులో అలా తిప్పుకొస్తానని తీసుకెళ్ళి యూనివర్సిటీ లాన్స్‌వైపు వెడ్తూ డ్రైవ్ చేస్తూ, చేస్తూ, మధ్యలో నెమ్మదిగా తను చేయి జాచి ఆ అమ్మాయి చేయి తన చేతిలోకి తీసుకుని 'లక్ష్మీ! నే నెంత అదృష్ట వంతుణ్ణి' అంటున్నాడు. ఆ అమ్మాయి అప్పుడు తన చేతిలోవున్న చేయి తీసేసుకుని చప్పున సిగ్గుతో రెండు చేతుల్లో మొహం దాచుకుంటోంది. ఇద్దరి మధ్య ఓ అందమైన నిశబ్దం యేర్పడింది. ప్రపంచం యెంత సుందరంగా వుంది. గాలి చక్కగా వీస్తోంది. యెంత బాగుంది. శ్రీధర్ గట్టిగా వూపిరి పీల్చి వదిలాడు. అరె! అప్పుడే ఇల్లు వచ్చేసిందే! అతనికి తేలియకుండానే అతని చేతులు కారుని ఇంటికి తీసుకొచ్చేసాయి.

వరండా మెట్ల ముందుకు వచ్చి కారు కుదుపుతో ఆగింది. కారు దిగిన ఆ అమ్మాయి ఒక్క పరుగులో లోపలకు వెళ్ళింది. నవ్వుకుంటూ వెనకవస్తున్న శ్రీధర్ ఆ చుట్టుప్రక్కల బామ్మగారి శబ్దం విన్పించక పోవటం చూసి 'బామ్మా మీ లక్ష్మి వచ్చింది' అని కేక వేసాడు. ముందుకు పరుగెత్తబోతున్న ఆ అమ్మాయి హఠాత్తుగా ఆగి వెనక్కు తిరిగి శ్రీధర్ వంక చూసింది. శ్రీధర్ ఇంకా నవ్వుతూనే వున్నాడు. ఇంతలో జారిపోతున్న కొంగుని తలమీద సరి చేసుకుంటూ బామ్మగారే ఇవతలకు వచ్చారు. "ఇదుగో! నీ లక్ష్మి - సరేనా?" పాంట్ జేబులో చేయి పెట్టుకుని ఠీవిగాచూస్తూ అన్నాడు.

అప్యాయంగా కౌగలించుకుంటారో, కన్నీరు కార్చుకుంటారో అని యెదురు చూస్తున్న శ్రీధర్‌కి ఆశాభంగం అవటమే గాకుండా తలమీద పిడుగు పడ్డట్లుగా 'యెవర్రా ఈ అమ్మాయి. మన జయ లక్ష్మి రాలేదూ?' అన్నారు బామ్మగారు. బొమ్మలా నిలబడిపోయిన లక్ష్మి కదలిక తెచ్చుకుంటూ "సుజాతా వాళ్ళ ఇల్లు కాదా ఇది? మీరు సుజాత మరిది కాదూ?" అంది శ్రీధర్‌కి దగ్గిరగా వచ్చేసి బామ్మగారి వంక భయంగా చూస్తూ.

"సుజాత యెవరూ? యెవరి మరిదిని నేను?" తెల్లబోయిన శ్రీధర్ అస్పష్టంగా గొణుక్కున్నాడు.

ఆ అమ్మాయి క్షణం సేపు శ్రీధర్ కళ్ళలోకి జాలిగా చూసింది. మరుక్షణం కళ్ళలో నీళ్ళు కారబోయి ఆగి పోయినాయి. తనని తను తమాయించుకుని తేరుకున్నట్లుగా చూస్తూ "పొరపాటయి వుండాలి. ఇది మలక్ పేట కాదూ? ఆగండి. అడ్రస్ వుండాలి" అంది పర్సులో గబగబా కాగితం కోసం గాలిస్తూ.

"లేదు. ఇది నారాయణ్ గూడ." అన్నాడు శ్రీధర్.

రెప్ప వాల్చకుండా ఆ అమ్మాయిని చూస్తూ, 'యెవరీ అమ్మాయి. యెందుకిలా వచ్చింది? క్షణం క్రితం తనని అందమైన వూహా సౌధాలకి సార్వ భౌముణ్ణి చేసింది. ఇప్పుడు కాలదన్నేస్తోంది' అనుకున్నాడు. రెండు నిమిషాల్లో పర్సులోంచి అడ్రస్ కాగితం తీసి చూపింది. అడ్రస్, పేరు యెవరిదో వుంది. మలక్ పేట. గవర్నమెంట్ క్వార్టర్స్.

తర్వాత కొద్దిసేపటికి, తనకు చెందని, తన ఇంటికి రాని ఆ అమ్మాయిని పక్కన కూర్చో పెట్టుకుని ఆ అడ్రస్ వెతుక్కుంటూ అంత రాత్రి వేళ బైలుదేరాడు శ్రీధర్. పోనీ యెవరైనా ఆ రాత్రి వుండి పొమ్మంది బామ్మగారు. కానీ ఆ అమ్మాయి వినలేదు.

ఆ అమ్మాయి బెజవాడనుంచి స్నేహితురాలి దగ్గిరకు వచ్చింది. వస్తున్నానని రాసిన వుత్తరం అసలు వాళ్ళకి అందనే లేదు. అందుకే సుజాత తన మరిదిని కారు దగ్గరకు పంపలేక పోయింది. ఆ స్నేహితురాలు, స్నేహితురాలి మొగుడు ధన్యవాదాలతో, కృతజ్ఞతా వాక్యాలతో శ్రీధర్ని వుక్కిరి బిక్కిరి చేసేశారు. జరిగిందంతా చెప్పి క్షమార్పణ కోరుకున్నాడు శ్రీధర్. తీరా వచ్చెయ్యబోతుండగా ఆ అమ్మాయి ఇవతలకు వచ్చి "నా పేరు విజయలక్ష్మి. పేరుగూడా ఒకటి అవటంవల్ల ఇలా అయింది. ఈ అనుభవాన్ని యెప్పుడూ మర్చిపోలేను. మిమ్మల్ని గూడా" అంది తియ్యగా నవ్వుతూ. చేతులు జోడించి నమస్కారం చేసి సెలవు తీసుకుంటూ "నేను గూడా-" అన్నాడు శ్రీధర్ స్వచ్ఛంగా తళ తళతలాడ్తూ పసితనం నింపుకున్న కళ్ళల్లోకి లోతుగా ఆఖరి సారిగా చూస్తూ.

శ్రీధర్ ఇంటికొచ్చేసరికి సన్నగా దారంలా టి.బి. పేషంట్‌లా వుండి, పీచుల్లాంటి రెండు జడలతో మొహాన వెర్రిగా వున్న ఇంత బొట్టుతో, పాలిపోయినట్లున్న తెలుపు రంగుతో వున్న అమ్మాయిని కూర్చోబెట్టి బామ్మగారు ఇల్లెగిరి పోయేటట్లు నవ్వుతోంది. "ఇదుగోరా! జయలక్ష్మి. యెవరిదో చిన్న కారు వస్తోంటే వచ్చిందిట." అన్న బామ్మగారి వాక్యాలు శ్రీధర్‌కి విన్పించలేదు.

అతనికేదో గొప్ప అనుభవం అందబోయి జారిపోయి దురదృష్టవంతుడివని వెక్కిరించినట్లయింది. యెంతో అందంగా రంగులు యేరి ఓపిగ్గా కట్తున్న పూలమాలని తెంపి పువ్వులు చిందర వందరగా గిరాటు పెట్టినట్లు, అందంగా బొమ్మ వేద్దామని కాగితం తీసుకుని రంగులు కలుపుకుంటుంటే యేదో దురదృష్ట శక్తి వచ్చి ఆ రంగులు తన్నేసి, ఆ కాగితాన్ని చించేసి, వికటాట్టహాసం చేసినట్లు అన్పించింది. నిట్టూర్పు విడిచి తన గది లోకి వెళ్ళబోతూ 'యెక్కడ విజయలక్ష్మి - యెక్కడ జయలక్ష్మి. ఒక్క 'వి'లో యెంత తేడా?' అనుకున్నాడు. ఒక్కోసారి అంతే! జీవితంలో మనం ఆశించని సంఘటనలు మనకు లభించి మనని వుక్కిరి బిక్కిరి చేస్తాయి.

**[యువ అక్టోబర్ 1961 సంచిక నుంచి]**



## రంగస్థల నటి బాదం సుబ్బలక్ష్మి

కళారాధనకు మించిన, ఆరాధన లేదంటూ సుమారు నలభై సంవత్సరాలుగా నాటక రంగానికి సేవ చేస్తున్న శ్రీమతి బాదం సుబ్బలక్ష్మి ఆంధ్ర నాటక రంగం గర్వించతగ్గ ఆణిముత్యం. ఈమె మొట్టమొదటిసారిగా "చింతామణి"లో చిత్రపాత్రను ధరించి తన నట జీవితాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకూ కొన్ని వందల సాంఘిక, పౌరాణిక, చారిత్రాత్మక నాటకాల్లో నటించారు.

నాటి నుండి నేటి వరకు ఈమె కథానాయికిగా నటించిన నాటకాలన్నీ మహానటులతో నటించినవే. "కన్యాశుల్కం"లో మధురవాణిగా కనకాల దేవదాసు తోనూ, సినీ నటులు కీ॥శే॥ హరనాథ్ రాజుతోను నటించారు. అలాగే డి.వి. నరసరాజుగారి "వర ప్రసాదం" నాటకంలో ఏడిద నాగేశ్వరరావు గారి తోనూ - రమణమూర్తిగారితోనూ కూడా నటించారు. ఇక "కీర్తిశేషులు" నాటకంలో జానకిగా ప్రఖ్యాత సినీ నటులు రావుగోపాలరావు గారితోను - ప్రఖ్యాత రంగస్థల నటులు కె. వెంకటేశ్వరరావు గారితోనూ నటించారు.

ఇక ఈమె అందుకున్న బహుమతులు, ప్రశంసా పత్రాలు, పొందిన సన్మానాలు, సత్కారాలు అనేకం. 1957లో బందరుకళా పరిషత్తు పోటీలలో "చెప్పు క్రింద పూలు" నాటికలో ఉత్తమనటిగా, తణుకు ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మరియు తెలుగు విశ్వవిద్యాలయం వారి సంయుక్తసారథ్యంలో, విజయనగరంలో నిర్వహించిన నాటకోత్సవాలలో, తెలుగు నాటక రంగ ప్రగతికి విశిష్టసేవలందించిన శ్రీమతి బాదం సుబ్బలక్ష్మికి ప్రశంసా పత్రాన్నందజేసి ఘనంగా సన్మానించారు.

-నక్కా వెంకటేశ్వరరావు